## క్లుప్తంగా

### భ్రమరాంబాదేవికి ఊయలసేవ



స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

**శ్రీశైలంటెంపుల్:** అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### మహానందిలో డ్వామా పీడీ పూజలు



మహానందికి వచ్చిన పీడీ సూర్యనారాయణ

**మహానంది:** మహానందీశ్వర స్వామి సన్నిధిలో డ్వామా నూతన పీడీ సూర్యనారాయణ శుక్రవారం పూజలు చేశారు. దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగ మల్లయ్య, ఏపీఓ మల్లికార్జున స్వాగతం పలికారు. ఆయన కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనాలు చేసి స్వామి వారి ప్రసాదాలు అందించారు.

### బేకరీషాపులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**ఆత్మకూరు:** పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం వేకువజామున అగ్ని ప్రమాదం జరగడంతో బేకరీషాపు పూర్తిగా దగ్ధమైంది. వేకువజామున 3 గంటలకు విద్యుదాఘాతంతో బేకరీలో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేలోపే బేకరీషాపులోని బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్స్ తదితర తినుబండారాలు కాలి బూడిదైంది. రూ.2 లక్షల వరకు నష్టం జరిగినట్లు షాపు నిర్వాహకుడు రమేష్‌నాయక్ తెలిపాడు. అగ్నిమాపక కేంద్రం అధికారి యు.రాజు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

### బాధ్యతల స్వీకరణ



ఏఓ పవన్ కుమార్

**వెలుగోడు/బండిఆత్మకూరు:** మండల వ్యవసాయ అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వెలుగోడులో పని చేస్తున్న ఏఓ పవన్ కుమార్‌ను బండిఆత్మకూరుకు, బండిఆత్మకూరులో పని చేస్తున్న స్వాతిని వెలుగోడుకు అధికారులు బదిలీ చేయడంతో వారు బాధ్యతలు స్వీకరించారు.

### కరెంట్ సమస్య తలెత్తనివ్వం



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

**పాములపాడు:** స్థానిక ఎస్సీ కాలనీలో ఇక నుంచి విద్యుత్ సమస్య తలెత్తదని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన త్రీ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని వచ్చిన ఫిర్యాదులతో పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



**శ్రీశైలం టెంపుల్:** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై శ్రీశైలానికి చెందిన ఎస్. కుమార్‌చే కూచిపూడి నృత్య కార్యక్రమం నిర్వహించారు. మూషికవాహన, వినాయక కౌత్వం, లింగాష్టకం, శివ తాండవం, శివస్తుతి, దేవీ స్తుతి, పార్వతీవల్లభాష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు అమృతవర్షిణి, అక్షయ, వరలక్ష్మీ, అభినయశ్రీ, రామతులసి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

# వర్షాకాలం .. జర జాగ్రత్త!

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.
- పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారుల సూచన

**బండిఆత్మకూరు:** వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రజలు, వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటే వ్యాధులను కట్టడి చేయవచ్చు. జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడడంతో పాటు వైద్య ఖర్చులతో జేబులు ఖాళీ అవుతాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించి దోమలు విపరీతంగా వృద్ధి చెంది విష జ్వరాలు, డెంగీ, మలేరియా, అతిసారం, చికున్ గున్యా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఎవరికి వారే స్వీయ జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు తమ సూచనలు పాటించాలని వైద్యాధికారులు చెబుతున్నారు.



తొట్టిలో ఉన్న నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

**డెంగీ**

పగలు కుట్టే ఎడీస్ ఈజిప్ట్ అనే దోమ కాటుతో ఈ వ్యాధి ప్రబలుతోంది. ఈ వ్యాధి సోకినవారికి తీవ్రమైన జ్వరం, నొసటిపై తలనొప్పి, కంటి లోపల కదలికలు తగ్గడం, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అవుతున్నట్లు ఉండడం, నోరు ఎండి పోతుండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**నివారణ చర్యలు**

- ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి తొట్టెలు, టైర్లు, మురుగు కాలువల్లో నీటి నిల్వలు లేకుండా చూచుకోవాలి.
- ప్రతి శుక్రవారం పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని పారబోసి డ్రైడే పాటించడం.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి.
- కూలర్లు, ఫ్రిజ్‌లు, బయట పడేసిన కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలి.

**మలేరియా**

అనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకితే చలి, జ్వరం, విపరీతమైన తలనొప్పి తదితర లక్షణాలుంటాయి.

**చికున్‌గున్యా**

ఎడీస్ దోమ ద్వారా ఈ వ్యాధి ప్రబలుతుంది. అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**ఫైలేరియా**

మురుగు నీటిలో పెరిగే క్యూలెక్స్ దోమ కాటుతో ఫైలేరియా వ్యాధి ప్రబలుతుంది. మురుగు నీటిలో దోమలు లార్వాలు వృద్ధి చెందకుండా కిరోసిన్, వేస్ట్ ఆయిల్ చల్లి దోమల లార్వాలు నాశనం చేయాలి.

**ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం**



వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా గ్రామాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తది తక సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో రక్త పరీక్ష కిట్లు అం దుబాటులో ఉంచాం. ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై పర్యవేక్షిస్తున్నారు.

– భావనారెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు, బండిఆత్మకూరు

### వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కమిటీ నియామకం

**నందికొట్కూరు:** వైఎస్సార్‌సీపీ మున్సిపల్ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధ్యక్షులు వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నియమించారు. మున్సిపాలిటీ యూత్ విభాగం అధ్యక్షులుగా పి.సతీష్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షులుగా ఎస్.హసీనా, రైతు విభాగం అధ్యక్షులుగా జీ. మహేశ్వరరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులుగా ఎం.శివకుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా వై.చరణ్‌తేజ, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా ఎ.రాజు, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా ఎస్.కే.వలి, క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా కే.సురేష్, స్టూడెంట్ విభాగం అధ్యక్షులుగా ఎం.శశాంక్, మున్సిపల్ విభాగం అల్లూరు కృష్ణ, ఆర్టీఐ విభాగం అధ్యక్షులుగా బీ.సూర్యకుమార్‌రెడ్డి, వలంటీర్ విభాగం అధ్యక్షులుగా రియాజ్ సయ్యద్, అవెర్నేష్ విభాగం అధ్యక్షులుగా బీ.నాగేంద్రప్రసాద్, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా సయ్యద్ యూనిస్, వైఎస్సార్‌టీయూసీ పీ. ఉస్మాన్ బాషా, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షులుగా రాజేశ్వరి, కల్చరల్ విభాగం అధ్యక్షులుగా కే.దావీద్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షులుగా ఎం.హరికృష్ణ, దివ్యాంగుల విభాగం అధ్యక్షులుగా ఫారూక్, పబ్లిసిటీ విభాగం అధ్యక్షులుగా పీ.రఫి(జగన్)ల జాబితాను పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది.

## పుల్యాల రామచంద్రారెడ్డి అకాల మరణం



రామచంద్రారెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిద్ధార్థరెడ్డి



పుల్యాల రామచంద్రారెడ్డి(ఫైల్)

**పగిద్యాల:** వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆర్‌సీ విద్యా సంస్థల అధినేత పుల్యాల రామచంద్రారెడ్డి(52) అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి సోదరుడు రాచంద్రారెడ్డి క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ మండలంలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఆర్‌సీ విద్యా సంస్థలను స్థాపించి ఎంతో మంది విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేశారు. ఆయన అకాల మృతి తెలుసుకున్న విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు స్వగ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి**



బోగోలు నాగన్న(ఫైల్)

**వెలుగోడు:** మోతుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోగోలు నాగన్న(68) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. నాగన్న సింగిల్ విండో వైస్ చైర్మన్‌గా, గ్రామ ఉప సర్పంచ్‌గా సేవలందించారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## 1,100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



నీలిషికారిపేటలో బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారి వి. రాముడు

**నందికొట్కూరు:** చట్టానికి వ్యతిరేకంగా నాటు సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ అధికారి వి.రాముడు హెచ్చరించారు. శుక్రవారం పరిధిలోని నీలిషికారి పేటలో సోదాలు నిర్వహించారు. సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1,100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటు సారా తయారు చేస్తున్న షికారి చిట్టెమ్మ, శైలజ, దోర, చెన్నమ్మలను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. సోదాల్లో సీఐ రామాంజనేయులు నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుభాషిణి, ఎస్‌ఐలు మారుతి, జగదీ ష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే బోట్లు సీజ్ చేస్తాం



బోటు నిర్వాహకులకు సూచనలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

**కొత్తపల్లి:** సంగమేశ్వరం, సిద్ధేశ్వరం వద్ద కృష్ణానదిలో నిబంధనలు ఉల్లంఘించిన మరబోట్లు తిప్పితే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఉమారాణి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కార్యాలయ్యంలో సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, బలపాలతిప్ప, జానాల గూడెం బోటు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణానదిపై సంగమేశ్వరం, సిద్ధేశ్వరం ఘాట్ల నుంచి తెలంగాణ ప్రాంతం సోమశిలకు ప్రభుత్వ అనుమతులు లేకుండా నడపరాదన్నారు. నడిపేవారికి తప్పకుండా బోటుకు ఇన్సురెన్స్, డ్రైవర్‌కు లైసెన్స్, లైఫ్‌జాకెట్లు, ఎక్కడి నుంచి ఎక్కడికి తిప్పుకోవాలనే విషయాలు, ఇతర ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సిబ్బంది, మరబోట్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

## జూలై 30, 31న డోన్‌లో జిల్లా మహాసభలు

**ఆత్మకూరు:** సీపీఐ జిల్లా మహాసభలు జూలై 30, 31వ తేదీల్లో డోన్‌లో నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మహాసభల్లో పెద్దఎత్తున సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు లల్లూ, చాంద్‌బాషా, అత్తావుల్ల, బిసన్న, రావూఫ్, పుల్లయ్య, ముర్తుజాబీ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు

### ఆలయాల భద్రతకు చర్యలు

**శిరివెళ్ల:** ఆలయాల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ దస్తగిరిబాబు అన్నారు. శుక్రవారం నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఇటీవల ఆళ్లగడ్డ మండలం పుట్లాలమ్మ గుడిలో భారీ చోరీ జరిగింది. ఈ నేపథ్యంలో సీఐ, ఎస్‌ఐ చిన్న పీరయ్య ఆలయాల భద్రతపై దృష్టి పెట్టారు. నరసింహ స్వామి ఆలయంలో ఉన్న హుండీలు, స్వామి వారి ఆభరణలపై ఈఓ నరసయ్యను ఆరా తీశారు. ప్రతి దేవాలయంలో తప్పని సరిగా సీసీ కెమెరా, వాచ్ మెన్ ఉండాలని సీఐ అన్నారు. ఆ దిశగా ఆలయాల ఈఓలు, నిర్వాహకులకు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. దొంగతనాలు జరగకుండా గస్తీ ముమ్మురం చేశామన్నారు. ఆదాయాలు, ఆభరణాలు గల ఆలయాల్లో నైట్ వాచ్‌మెన్ నియామకాలను తప్పని సరి చేస్తున్నామన్నారు.

### మహా విషాదానికి చిత్రాంజలి

గుజరాత్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదం మాటలకందని మహా విషాదాన్ని మిగిల్చింది. సుమారు 270 మంది ప్రాణాలు తీసుకుంది. అహ్మదాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం మెడికల్ కాలేజీపై కుప్పకూలి పేలిపోవడంతో చోటు చేసుకున్న ఈ ఘటనపై నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ ఊహా చిత్రం గీచారు. చిన్నాభిన్నమైన శరీర భాగాలు, బాధిత కుటుంబసభ్యుల అర్తనాదాలకు చిత్రరూపమిచ్చి నివాళులర్పించారు. – నంద్యాల(అర్బన్)



### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వెలుగోడు:** మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ రవీంద్రనాయక్ తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల పనుల కారణంగా అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

### పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



మహానందిలో పల్లకీసేవ

**మహానంది:** మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ముందుగా మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి అలంకార మండపంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, హారతులు ఇచ్చి పల్లకీలో కొలువు తీర్చారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల పల్లకీ ఉత్సవం కనులపండువగా సాగింది. పలు ప్రాంతాల భక్తులు పల్లకీసేవలో పాల్గొని ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేశారు.

### గీత దాటితే జరిమానా



రోడ్డుపై లైన్లు వేయిస్తున్న ఎస్‌ఐ

**వెలుగోడు:** ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన గీత దాటి వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని ఎస్‌ఐ సురేష్ హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన రహదారి వెంట లైన్లు వేయించిన అనంతరం, స్థానికులకు రోడ్డు భద్రతాపై ఎస్‌ఐ అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లను ఉపయోగించొద్దని సూచించారు. వాహనాలు ఓవర్‌టేక్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.

### ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ

**వెలుగోడు:** ఎమార్పీఎస్, ఎంఎస్పీ మోతుకూరు గ్రామ కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. ఎంఎస్పీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గుండెపోగు యోసేపు మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షునిగా వాదం సంజీవ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా డి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కే శ్రీనాథ్ మాదిగలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా అధికార ప్రతినిధి బాషాపోగుల దరగయ్య మాదిగ, మండల కో–ఇన్‌చార్జ్‌లు బి.ఆరోగ్యం, టి.వెంకటేశ్వర్లు, నాయకులు నవీన్, వెంకటరమణ, మాదిగ, ఎంఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాషపోగుల చిన్న వెంకటరమణ మాదిగ పాల్గొన్నారు.

### తాటిపాడులో హైఓల్టేజ్ సరఫరా

**జూపాడుబంగ్లా:** మండలంలోని తాటిపాడు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ హైఓల్టేజీ సరఫరా కావటంతో తాగు నీటి మోటారు కాలిపోయింది. అలాగే వీధిదీపాలు, ఫ్యాన్లు కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ మోటార్ కాలిపోవటంతో గ్రామంలోని కుళాయిలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, అధికారులు చర్యలు తీసుకుకొని త్వరగా మోటార్లకు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### 16న జాబ్‌మేళా

**ఆత్మకూరు:** ఈనెల 16న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో 10 ప్రయివేట్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమా, బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన నిరుద్యోగులు పాల్గొని ఉద్యోగాలు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 7673902328, 9154830286 నంబర్లను సంప్రదించాలన్నారు.

## దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కండి

**నందికొట్కూరు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను విస్మరించడంపై నిరసిస్తూ వచ్చే నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు సిద్ధ కావాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జున కోరారు. పార్టీ కార్యాలయంలో ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని కోరారు. 50 ఏళ్ల దాటినా ప్రతి కార్మికుడికి నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబరు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ పట్టణ కమిటీ సభ్యులుగా శివకుమార్, కృష్ణ, మహబూబ్ బాషా, ఖలీల్, ఎల్లనాయుడులను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు భాస్కర్‌గౌడ్, రామకృష్ణ, రాజారత్నం, ఖలీల్, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, నాగార్జున

## ఆలయ భూములకు తగ్గిన ఆదాయం



వేలం పాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

**బండి ఆత్మకూరు:** మండల పరిధిలోని భోజనం గ్రామానికి చెందిన ముక్తేశ్వర ఆలయ భూములకు శుక్రవారం నిర్వహించిన కౌలు వేలంపాటలో ఆదాయం తగ్గిందని గ్రూపు దేవస్థానముల ఈఓ నాగప్రసాద్ తెలిపారు. 27.29 ఎకరాల భూములకు నిర్వహించిన వేలంపాటలో రూ.5.36 లక్షలు రైతులు దక్కించుకున్నారన్నారు. గత సంవత్సరంలో రూ.11.55 లక్షలు రాగా ఈ ఏడాది దాదాపు రూ.6.19 లక్షలు ఆదాయం తగ్గిందన్నారు. వేలంపాటలో నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి పి.హరిచంద్రారెడ్డి, ఎస్‌ఐ జగన్మోహన్ పాల్గొన్నారు.

## కొందరికి ‘వందనం’..మరికొందరికి పంగనామం!

- 440 మంది విద్యార్థులకు అందని ‘అమ్మకు వందనం’ డబ్బులు

**జూపాడుబంగ్లా:** నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు అంటూ ఇంట్లో ఎంత మంది విద్యార్థులుంటే అంత మందికి అమ్మకు వందనం నిధులు మంజూరు చేస్తానని ఎన్నికల ముందు ఊదరగొట్టిని చంద్రబాబునాయుడు.. ఇప్పుడేమో కొందరికి పంగనామాలు పెట్టాడు. జూపాడుబంగ్లా మండలంలో 8 ఉన్నత పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, 28 ప్రాథమిక ప్రాథమిక పాఠశాలలున్నాయి. అందులో 4,562 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారందరికి అమ్మకు వందనం పథకం వర్తించాల్సి ఉండగా 4,122 మందికి మాత్రమే రూ.13వేల చొప్పున వారి తల్లుల ఖాతాలకు జమ అయ్యాయి. ఇంకా 440 మంది విద్యార్థులకు మొండి చేయిచూపటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గతేడాది పదో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యను అభ్యసించిన విద్యార్థుల పేర్లు జాబితాలో లేకపోవటంతో వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**శ్రీశైలంలో 174 మంది అనర్హులు..**

**శ్రీశైలం టెంపుల్:** శ్రీశైలం గ్రామంలో తల్లికి వందనం పథకానికి 174 మంది అనర్హులుగా నమోదయ్యారు. శ్రీశైలంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో విద్యనభ్యసిస్తున్న 1,488 మంది విద్యార్థులకు గానూ 1,314 మంది పథకానికి అర్హులయ్యారు. 174 మంది విద్యార్థులు ఇన్ ఎలిజిబుల్ లిస్ట్‌లో ఉండిపోయారు.

## కుక్కల బెడదను అరికట్టాలి

**ఆత్మకూరు:** పట్టణంలో కుక్కల బెడదను అరికట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం ధనుంజయ మీటింగ్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తోటగేరి, పెద్దపీర్ల వీధి, అప్పలరావు వీధి, పాత బస్టాండు, గరీబ్‌నగర్, తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డు వెంట పాదచారులను కుక్కలు దాడి చేసి కరుస్తున్నాయన్నారు. ఇప్పటికే 20 మందికిపైగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న, ఇస్మాయిల్, నాగేశ్వరరావు, భాస్కర్, జబీవుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్

## నేడు ‘యోగాంధ్ర’

**కొత్తపల్లి:** మండలంలోని అన్ని సచివాలయాల్లో సిటిజన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరూ శనివారం నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో యోగాంధ్ర పేరుతో చేపట్టనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు చొరవచూపాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి వచ్చే వారికి గ్రీన్‌మ్యాట్, తాగునీటి వసతి ఏర్పాట్లు చేయాలన్నారు.

## స్తంభం ఏర్పాటు చేసి.. కనెక్షన్ మరిచి!

మండల కేంద్రంలోని చౌడేశ్వరీదేవి ఆలయం ఎదురుగా పాత ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఈ స్తంభంపై కాలనీ వాసులు గతంలో ఫిర్యాదు చేయడంతో విద్యుత్ శాఖ అధికారులు దానిపక్కనే కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కనెక్షన్ మాత్రం ఇవ్వడం మరిచారు. మరోవపు పాత ఇనుప స్తంభం శిథిలావస్థకు చేరి కేవలం విద్యుత్ తీగల ఆసరాతో ఉంది. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి. ఇదే విషయమై పలు మార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చినా అధికారుల నుంచి స్పందన కరువైందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎలాంటి ప్రమాదాలకు జరగకముందే పాత స్తంభం తొలగించి నూతన స్తంభానికి కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు. – పాములపాడు



శిథిలావస్థకు చేరిన పాత స్తంభం వద్ద ఏర్పాటు చేసిన నూతన స్తంభానికి కనెక్షన్ ఇవ్వని దృశ్యం